సాక్షి ఒడిశా

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,77,184లు, బంగారం 3గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 30గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఆహార భద్రత చట్టంపై అవగాహన

పర్లాకిమిడి: దేశంలో ఏ ఒక్కరూ ఆహార కొరతతో మరణించకూడదని కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టాన్ని తెచ్చిందని ఒడిశా రాష్ట్ర కృషక్ సమాజ్ అధ్యక్షుడు పూర్ణచంద్ర మహంతి అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని రాయఘడ బ్లాక్ సేవకపూర్ వద్ద పరశురాం గురుకుల కళాశాలలో గురువారం ఉదయం నిర్వహించారు. వచ్చే నెల నుంచి రాష్ట్ర ఆహార భద్రత కింద రేషన్ కార్డులో కుటుంబంలో ఒక్కరికి ఐదు నుంచి పది కిలోల బియ్యం పంపిణీ చేస్తారన్నారు. ఈ సమావేశంలో గజపతి జిల్లా కృషక్ సమాజ్ అధ్యక్షురాలు అల్లిబెల్లి హేమలత, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికాంత మహాపాత్రో, అధ్యాపకులు స్మితాకుమారీ గౌడ, తెలుగు అధ్యాపకులు ఎం.మిన్నారావు, మోహన్ ప్రధాన్, రస్మితా సింగ్, తదితరులు పాల్గొన్నారు. ఆహార దినోత్సవం సందర్భంగా.. చేయి చేయి కలిపి.. ఉత్తమ ఆహారం.. ఉత్తమ భవిష్యత్ నినాదాలు చేశారు.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన చిత్తరంజన్ పట్నాయక్

రాయగడ: రోడ్డు ప్రమాదంలో గుడారికి చెందిన చిత్తరంజన్ పట్నాయక్ (56) అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. తన స్కూటీపై పని మీద రాయగడ వస్తుండగా లబాగుడ వద్ద ఎదురుగా వస్తున్న ఒక పికప్ వ్యాన్‌ను అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో అతడు తీవ్రగాయాలకు గురవ్వగా అక్కడి కొందరు అతడిని రామనగుడ ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలకు గురైన అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఢీకొని వెళ్లిన పికప్ వ్యాన్‌ను గాలిస్తున్నారు.

స్కూల్ బస్ అతి వేగం.. ఒకరు మృతి





ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు

కొరాపుట్: స్కూల్ బస్ అతి వేగం వల్ల ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి తురిడి పంచాయితీ కేంద్రం నుంచి బిజూ పట్నాయిక్ స్కూల్ బస్ రాయిఘర్ వైపు వెళ్తుంది. ఇదే సమయంలో తురిడికి చెందిన సోమార్ గొండో (60) తన ద్విచక్ర వాహనంతో ఇంటికి వస్తున్నాడు. బస్సు వేగంగా దూసుకు రావడంతో అతడి బైక్ ఢీ కొని అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సోమార్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. బస్సులో ముగ్గురు చిన్నారులు గాయ పడ్డారు. రాయిఘర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాయిఘర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కలిమెల సమితిలో మావో డంప్ స్వాధీనం



జవాన్లు స్వాధీనం చేసుకున్న మావోల డంప్

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా పోలీసులు కూంబింగ్‌లో గురువారం కలిమెల సమితి మధుమాల్, చిలకలమామ్మిడి అటవీ ప్రాంతంలో ఓ డంప్‌ను జవాన్లు గుర్తించి దాన్ని బయటకు తీశారు. ఆ డంప్‌లో తుపాకీ తయారీకి ఉపయోగించే పేలుడు పదార్థాలు, ఇతర మావో సామగ్రి ఉన్నాయి. ఈ డంప్ ఆంధ్రా–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోన్ కమిటీ మావోయిస్టులకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. డంప్‌లో 3ఐఇడి బాంబులు, 5 డిటోనేటర్లు, 4 మీటర్ల కోడెక్స్ తీగ, జనరేటర్, వెల్డింగ్ మెషీన్, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జవాన్లు ఆ ప్రాంతంలో కూంబింగ్ ముమ్మరం చేశారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోడూరు నారాయణరావు



పర్లాకిమిడి: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గజపతి జిల్లాకు మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావును బీజేపీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి మానస కుమార్ మహంతి గురువారం నియమించారు. మొత్తం పది జిల్లాలకు రాష్ట్ర బీజేపీ పార్టీ ప్రతినిధులుగా నియమించారు. ఆయన నియామకంపై గజపతి జిల్లా బీజేపీ అధ్యక్షులు నబకిశోరో శోబోరో, ఎంపీ ప్రతినిధి దారపు చిట్టి, రొక్కం వేణుగోపాలరావు, రొక్కం సతీష్ (కాశీనగర్) పురుటిగుడ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యర్థుల్ని గౌరవించడం క్రీడాస్ఫూర్తి



విజేతలతో రాష్ట్ర గవర్నర్ హరిబాబు

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: స్థానిక కళింగ స్టేడియంలో గురువారం 28వ ఐటీటీఎఫ్–ఏటీటీయూ ఆసియా టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్స్ 2025 ముగింపు కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి మాట్లాడుతూ పతకాలను సాధించడంతో విజయం పరిమితం కాకుండా క్రీడా స్ఫూర్తితో ప్రత్యర్థులను గౌరవించడం ఇతరులను ప్రేరేపించడంలో దోహద పడుతుందన్నారు. ఈ పోటీ నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని, మొదటిసారిగా ఒడిశా ఈ ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం ఇచ్చిందని, క్రీడల రాజధానిగా కళింగ స్టేడియం మరోసారి ప్రపంచ దేశాలను ఏకతాటిపైకి తెచ్చిందని అభినందించారు. గత 5 రోజులుగా కళింగ స్టేడియం అంతర్జాతీయ నైపుణ్య స్ఫూర్తి ఉత్సాహంతో ప్రతిధ్వనించడం తార్కాణంగా పేర్కొన్నారు. చాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళల జట్ల టైటిళ్లను గెలుచుకోవడం ద్వారా చైనా మరోసారి ప్రపంచ టేబుల్ టెన్నిస్‌లో తన సత్తా ప్రదర్శించింది. ఈ సందర్భంగా లండన్‌లో జరగనున్న 2026 ఐటీటీఎఫ్ ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లకు అర్హత సాధించిన జట్లను గవర్నర్ ప్రశంసించారు. టేబుల్ టెన్నిస్ ధైర్యం, స్థితిస్థాపకత, పట్టుదల నేర్పుతుందని డాక్టర్ కంభంపాటి అన్నారు. ఒక పాయింట్ కోల్పోయినప్పుడు కూడా, ఉత్తమ ఆటగాళ్లు ప్రశాంతమైన దృఢ సంకల్పంతో తిరిగి పుంజుకుంటారు. ఈ పట్టుదల జీవితంలో తిరిగి ఎదగ గలిగే మనోస్థైర్యం ప్రేరణకు ఉదాహరణగా పేర్కొన్నారు. క్రీడలు, యువజన సేవలు, ఒడియా భాష, సాహిత్యం – సంస్కృతి, ఉన్నత విద్యా శాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్, క్రీడలు, యువజన సేవల విభాగం కమిషనర్, కార్యదర్శి సచిన్ జాదవ్, క్రీడలు మరియు యువజన సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ యెద్దుల విజయ ఈ సందర్భంగా మాట్లాడారు.



విజేతలకు పతకాలతో సత్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటి

మహిళా సాధికారతపై దిశా నిర్దేశం



మిషన్ శక్తి వర్క్‌షాపులో పాల్గొన్న వివిధ ప్రభుత్వ, ఎన్జీఓ సంస్థల యాజమాన్యం



మహిళల వికాసం ప్రభుత్వ అధికారుల సమన్వయంపై మాట్లాడుతున్న గ్రామ వికాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిబి పి.జాన్‌సన్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మిషన్ శక్తి ద్వారా పలు ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్నాయని, గ్రామ వికాస్ సంస్థ గ్రామాల్లో విద్య, తాగునీరు, ఇతర కార్యక్రమాలు 1982 నుంచి చేపడుతుండడం మంచి విషయమని అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (రెవెన్యూ) మునీంద్ర హానగ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం మహిళా సాధికారతపై గ్రామ వికాస్ సంస్థ జిల్లా స్థాయి కన్వర్జెన్స్ కర్మశాలను ఏడీఎం మునీంద్ర ప్రారంభించారు. కర్మశాలలో జిల్లా పరిషత్ సీడీఓ, కార్య నిర్వహణాధికారి శంకర కెర్కెటా, గ్రామ వికాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిబి పి.జాన్‌సన్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో మొక్కజొన్న అమ్మకాలకు మార్కెటింగ్ లభించడం లేదని, రైతులను ప్రభుత్వ అధికారులు, ఎన్జీఓ సంస్థలు ఆదుకోవాలని గ్రామ వికాస్ డైరెక్టర్ లిబి పి.జాన్‌సన్ కోరారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలు మహిళల వికాసానికి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎన్జీఓ సంస్థలు కలిసి పనిచేయాలని జిల్లా పరిషత్ సీడీఓ శంకర కెరకెటా అన్నారు. వర్క్‌షాపులో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సునారాం సింగ్ మాట్లాడుతూ, గజపతి జిల్లాలో మైక్రో, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు మార్గదర్శకాలు వివరించారు. వర్క్‌షాపులో మిషన్‌శక్తి డైరెక్టర్ టిమోన్ బోరా, సి.సి.డి. స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎ.జగన్నాథ రాజు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన



జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన జరుపుతున్న ఆశా వర్కర్ల సంఘం



కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో ఆశా వర్కర్లు

పర్లాకిమిడి: అఖిల భారత ఆశా వర్కర్ల మహాసంఘం ఆదేశాల మేరకు గజపతి జిల్లా కలెక్టరేట్ వద్ద రాష్ట్ర ఆశా వర్కర్ల సంఘం వారు గురువారం ఆందోళన చేశారు. జాతీయ స్వాస్థ్య మిషన్‌లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, ఆశా వర్కర్లకు నెలసరి జీతం రూ. 18 వేలకు పెంపు, ప్రతి హెడ్ క్వార్టర్ ఆస్పత్రిలో ఆశా వర్కర్లకు విశ్రాంత భవనం, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ నిధిలో జమ, అర్హత కలిగిన ఆశా వర్కర్లకు ఏఎన్‌ఎంలుగా పదోన్నతి వంటి పలు డిమాండ్లతో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం భారతీయ మజ్దూర్‌సంఘ్ గజపతి అధ్యక్షులు సుజిత్ ప్రధాన్, ఆశా వర్కర్ల సంఘం కార్యదర్శి సమీక్షా గోమాంగో, అధ్యక్షురాలు నమితా గోమాంగో, రాష్ట్ర ఆశా వర్కర్లు ప్రతినిధి కామిని సింగ్ తదితరులు కలిసి అదనపు కలెక్టర్‌కు ముఖ్యమంత్రి పేరిట రాసిన వినతిని అందజేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన గవర్నర్



ముఖ్యమంత్రితో గవర్నర్ సంభాషణ

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధికారిక నివాస భవనంలో మర్యాదపూర్వకంగా సందర్శించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ గవర్నర్‌ను సాదరంగా స్వాగతించారు. వెలుగుల పండగ పురస్కరించుకుని ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్శన సందర్భంగా ఇరువురు ప్రముఖులు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న, ప్రారంభం కానున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు.

బాణసంచా పేలుడులో వాహనం దగ్ధం



వంతెనపై మంటల్లో దగ్ధమైన స్కూటీ

భువనేశ్వర్: స్థానిక ఆచార్య విహార్ ఓవర్ బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో స్కూటర్ దగ్ధమైంది. పేలుడుతో చెలరేగిన మంటల్లో చిక్కుకుని ఈ దుర్ఘటన సంభవించింది. ఈ విచారకర సంఘటనలో ఒక బాలునితో సహా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్కూటర్ డిక్కీలో బాణసంచా ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

దవిడిగాం వద్ద అక్రమ బాణసంచా గోదాము సీజ్



దవిడిగాం గ్రామం వద్ద అక్రమ బాణా సంచా నిల్వలు సీజ్ చేసిన పోలీసులు


పర్లాకిమిడి: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గుసాని సమితి కెరండి పంచాయతీ దవిడిగాం వద్ద లైసెన్సు లేకుండా అక్రమంగా గోదాముల్లో దాచి ఉంచిన మందుగుండు సామాన్లను పర్లాకిమిడి ఆదర్శ పోలీసు ష్టేషన్ అధికారి ప్రశాంత భూపతి, ఎస్‌డీపీఓ మాధవానంద్ నాయక్ గురువారం సాయంత్రం దాడులు జరిపి సీజ్ చేశారు. ఆకులమ్మ ఫైర్ వర్క్స్‌లో అక్రమ బాణ సంచా సుమారు రూ. 15 లక్షల స్టాకును పట్టుకుని దుకాణం సీజ్ చేశారు. యజమాని డి.సురేష్ (పర్లాకిమిడి)పై ఎక్స్‌ప్లోజివ్ చట్టం కింద కేసు పెట్టారు.

చివరి శ్వాస వరకు ఒడిశా తల్లికి సేవ చేస్తాను: నవీన్

- ప్రజల మధ్య నవీన్ పట్నాయక్ 79వ పుట్టినరోజు



ఆబాలగోపాలం నడుమ నవీన్ జన్మదినం వేడుక



పూరీ సాగర తీరంలో సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన సైకత శిల్పం



బాలలతో నవీన్ జన్మదినోత్సవం



బాలలు అందజేసిన జన్మదిన కానుకతో నవీన్ పట్నాయక్



ఎస్ఓఎస్ గ్రామంలో నవీన్ పట్నాయక్ పాదయాత్రలో అభివాదం

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, విపక్ష నేత నవీన్ పట్నాయక్ గురువారం తన 79వ పుట్టిన రోజు వేడుకలను ప్రజల మధ్య సందడిగా జరుపుకున్నారు. స్థానిక ఎస్ఓఎస్ గ్రామంలో ఆబాలగోపాలంతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఏకామ్ర నియోజకవర్గంలోని గంగ నగర్ బిజూ ఆదర్శ్ కాలనీలో జరిగిన ప్రజా పరస్పర స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక బీజేడీ కార్యకర్తలు, నివాసితులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రజలకు తన జీవితకాల నిబద్ధతను నవీన్ పట్నాయక్ పునరుద్ఘాటించారు. 'నా చివరి శ్వాస వరకు నేను ఒడిశా తల్లికి సేవ చేస్తాను అని ప్రకటించారు. సేవా దృక్పథం బిజూ జనతా దళ్ తత్వంగా పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో తమ బంధాన్ని బలోపేతం చేసుకుని ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ప్రయత్నాలు కొనసాగించాలని కోరారు. పిల్లలు ఆయనను ఆటపాటలతో స్వాగతించారు. పిల్లలు తయారు చేసిన కేక్‌తో నవీన్ పట్నాయక్ జన్మదిన వేడుకల్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా పిల్లలకు చాక్లెట్లు, బహుమతులు అందజేసి వారితో సంభాషించి కొంత సమయం గడిపారు. మాజీ ముఖ్యమంత్రి, విపక్ష నేత నవీన్ పట్నాయక్‌కు రాష్ట్ర గవర్నరు డాక్టరు హరి బాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి వంటి ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూరీ సాగర తీరంలో సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ భారీ ఆకర్షణీయ సైకత శిల్పం ఆవిష్కరించి అభినందించారు.

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



స్టాల్ ప్రారంభిస్తున్న ఖిమండో పక్కనే ఓర్మాస్ అధికారి లక్ష్మణ్, బసంత కుమార్ ప్రధాన్‌లు

రాయగడ: మన సంస్కృతీ, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖిమండో అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమీపంలో జిల్లా యంత్రాంగం, ఓర్మాస్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన దీపావళి సామాన్ల విక్రయ స్టాల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆనందాలకు, సంతోషాలకు దీపావళి వంటి పండగలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అభిప్రాయపడ్డారు. ఓర్మాస్ ద్వారా ఈ ఏడాది దీపావళి సామాన్ల విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేశామని ఓర్మాస్ అధికారి జి.లక్ష్మణ్ తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఈ స్టాల్‌లో స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు సొంతంగా రూపొందించే వివిధ రకాల దీప ప్రమిదలు, కొవ్వొత్తులు, అగరబత్తులు తదితర వస్తువులు లభ్యమవుతాయని పేర్కొన్నారు. ఇక్కడ తక్కువ ధరకు లభించే సామగ్రి కొనుగోలు చేసి ప్రోత్సాహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారం



పరిహార చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ ప్రదీప్ పాణిగ్రాహి తదితరులు

పర్లాకిమిడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ బ్లాస్టింగ్‌లో ప్రాణాలు కోల్పోయిన ఒడిశాకు చెందిన మోహనా బ్లాక్ వలస కార్మికులు భాస్కర్ బిసాయి, టుకునా దొళాయి కుటుంబాలకు బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి గురువారం మోహనా పంచాయతీ సమితి కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.4 లక్షల చొప్పున్న పరిహారం అందజేశారు. ఆగస్టు 3వ తేదీన కాకినాడలో ఒడిశాకు చెందిన వలస కార్మికులు ఒక బ్లాస్టింగ్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అనుప్ పండా, మోహనా బీడీవో రాజీవ్ దాస్, మోహనా సమితి చైర్మన్ రాజీవ్ శోబోరో తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మఝి న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా గిరిజన యువతకి ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రతిపాదనలు పరిశీలిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

- కొరాపుట్

క్లుప్తంగా

పాఠశాల పరిశీలన


విరిగిన బెంచీలను ఎమ్మెల్యేకు చూపిస్తున్న విద్యార్థులు

కొరాపుట్: హిందాల్కో ప్రైవేట్ సంస్థ ఆర్థిక సహాయంతో ఎక్స్ బోర్డు స్కూల్‌లో మరమ్మతులు చేస్తామని కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత ప్రకటించారు. గురువారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ నియోజకవర్గం కన్సారి గుడ గ్రామంలో ప్రభుత్వ స్కూల్‌ను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాడైన బెంచీలు, కుర్చీలను ఎమ్మెల్యేకు విద్యార్థులు చూపించారు. వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. హిందాల్కో సహాయంతో బాగు చేయిస్తామని హామీ ఇచ్చారు.

వైద్యుడి బదిలీని రద్దు చేయాలి


డాక్టరు బ్రజరాజ్ కర్ బదిలీని రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు

పర్లాకిమిడి: ఆర్.ఉదయగిరి బ్లాక్ రామగిరిలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ బ్రజరాజ్‌కర్‌ను ఉద్దేశపూర్వకంగా పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీ చేశారని, ఆ బదిలీని రద్దు చేయాలని తబార్‌సింగి, మరో రెండు గ్రామాల ప్రజలు కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసి ఏడీఎం ఫల్గుణి మఝికి గురువారం వినతిని అందజేశారు. డాక్టర్ బ్రజరాస్ కర్ మంచి వైద్యుడని, ఆయన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. రామగిరి సీడీపీఓ, ఇతర సిబ్బంది ఆయనపై అభియోగాలు మోపి ఐదు నెలల జీతం ఇవ్వకుండా చేశారని, చివరకు పర్లాకిమిడి కేంద్ర ఆస్పత్రికి బదిలీ చేశారన్నారు. వెంటనే ఆయన బదిలీని రద్దుచేసి, రామగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్ ఫరూల్ పట్వారీపై దర్యాప్తు


ఆర్‌డీసీ మహాపాత్రోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ అశుతోష్ కులకర్ణి

రాయగడ: జిల్లా కలెక్టర్‌గా ఇదివరకు విధులు నిర్వహించిన ఫరూల్ పట్వారీపై జిల్లా సంక్షేమ శాఖ అధికారి అసీమారావ్ చేసిన ఫిర్యాదు మేరకు దక్షిణాంచల్ ఆర్‌డీసీ సంగ్రామ్ కేసరి మహాపాత్రో దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన బుధవారం రాయగడలో పర్యటించారు. ప్రస్తుత కలెక్టర్ అశుతోష్ కులకర్ణితో చర్చించిన ఆయన ఎస్‌డీసీ (స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్)లో చోటుచేసుకున్న ఆర్థిక కుంభకోణంపై ఆరా తీశారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి అసీమారావ్‌ను ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. అందుకు సంబంధించి కొన్ని ఫైళ్లను కూడా తనిఖీ చేశారు. ఫరూల్ పట్వారీ రాయగడ కలెక్టర్‌గా విధులు నిర్వహించే సమయంలో వివిధ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన సామాన్లను ఖరీదు చేసే విషయంలో ఆదేశించిన ఫైల్స్‌ను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన శ్రీను మృతదేహం

కవిటి: మండలంలోని ఎన్‌హెచ్-16 హైవే పై శిలగాం ఫ్లైఓవర్ దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి ఆది ఆంధ్ర వీధికి చెందిన వాడపల్లి శ్రీను(39) మృతి చెందాడు. టెక్కలి పట్టణం ఆది ఆంధ్ర వీధికి చెందిన వాడపల్లి శ్రీను ఉదయం టెక్కలి నుంచి తన ద్విచక్రవాహనంపై ఇచ్ఛాపురం మండలం సంతోపేట గ్రామంలో ఉన్న బావమరిది పెంద్ర ముకేష్ ఇంటికి ప్రయాణిస్తున్నాడు. ప్రయాణం మధ్యలో కవిటి మండలం జమేదార్ పుట్టుగ గ్రామం దగ్గరలో ఎన్‌హెచ్ 16 రహదారి పై బండి అదుపు తప్పి హైవే డివైడర్‌ను గుద్దుకుని తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించి ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ విలేకరులకు తెలియజేశారు.

వంతెన బాగుచేయాలని వినతి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

జయపురం: జయపురం సమితి పాత్రో పుట్ గ్రామ సమీప కొలాబ్ నదిపై గల 94 ఏళ్ల కిందట నిర్మించిన ఇనుప వంతెనకు తగిన రక్షణ, పర్యవేక్షణ లేక ప్రమాదస్థితికి చేరుకుంది. వారం రోజులుగా వంతెన మరమ్మతులు చేపట్టాలని, దాని పక్కన మరో వంతెన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని, లేకపోతే ఆందోళన చేపడతామని పాత్రో పుట్ వంతెన సురక్షా సమితి సభ్యులు తెలిపారు. జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ ఇనుప వంతెన విజయవాడ-రాంచీ 326వ జాతీయ కారిడార్ మార్గం పాత్రో పుట్ సమీపంలో ఉందని, వంతెన మీదుగా జయపురం నుంచి బొయిపరిగుడ, లమతాపుట్, మాచ్‌ఖండ్ మల్కనగిరి, ఒడిశాలోని పలు ప్రాంతాలకే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వేలాది వాహనాలు రాకపోకలు చేస్తున్నాయని వెల్లడించారు. ప్రమాద స్థితిలో ఉన్న వంతెనపై రాకపోకలు బందు చేసే ముందు దాని పక్కనే మరో వంతెన నిర్మాణం నిర్మించేందుకు పనులు చేపట్టి, కంట్రాక్టర్ ఆ పనులు నిలిపివేసి వెళ్లిపోయాడని ఆరోపించారు. వంతెన పనులు జరిపేందుకు నేషనల్ హైవే అధికారులు మరో టెండర్ పిలిచేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. అధికారులు వెంటనే దృష్టి సారించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో పాత్రో పుట్ వంతెన సురక్షా సమితి సభ్యులు కేధార గౌరీదాస్, సంతోష్ పట్నాయక్, కృష్ణ కేశవ షాడంగి, బినయవజిత్ నాయక్, జితు నాయక్, జగన్నాథ్ రౌత్, రామనాథ్ దండసేన, సత్యనారాయణ సాహు, హేమంత ఖెముండు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవీన్ పట్నాయక్ పుట్టినరోజు


ర్యాలీలో పాల్గొన్న సుధీర్, జగన్నాథ సరక, బీజేడీ శ్రేణులు


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి సరక


గుణుపూర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ

రాయగడ: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ సుప్రీం నవీన్ పట్నాయక్ పుట్టిన రోజు వేడుకలను ఆ పార్టీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్నాథ సరక, మాజీ అధ్యక్షుడు సుధీర్ దాస్ నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ హాస్పటల్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. అనంతరం శాంతి ర్యాలీని నిర్వహించారు. నవీన్ పట్నాయక్ ఆరోగ్యంగా ఉండాలని జగన్నాథ, మజ్జిగౌరమ్మ మందిరాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు అనసూయా మాఝి, రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ కుమార్ పట్నాయక్, ఉదయ్ హిమిరిక తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని గుణుపూర్‌లో మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ ఆధ్వర్యంలో గుణుపూర్ సబ్ డివిజన్ హాస్పటల్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

ఒడిశా బీజేపీ కొత్త కార్యవర్గం

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర శాఖ గురువారం కొత్త కార్యవర్గం సభ్యుల వివరాలు వెల్లడించింది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి మానస్ కుమార్ మహాపాత్రో అధికారికంగా ఈ జాబితా విడుదల చేశారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఆమోదంతో ఈ జాబితా వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యవర్గంలో 10 మంది ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, 10 మంది కార్యదర్శులతో పాటు ఒక కోశాధికారి, ఒక సంయుక్త కోశాధికారిని ప్రకటించారు. ఉపాధ్యక్షుల్లో డాక్టర్ జతిన్ మహంతి (ఖుర్దా), అశోక్ మిశ్రా (నయాగఢ్), కుసుమ్ టెట్టే (సుందర్‌గఢ్), రమేష్ చంద్ర సాహు (నవరంగ్‌పూర్), కె. నారాయణ్ రావు (గజపతి), శిబాజీ మహంతి (బొలంగీర్) మరియు భావేంద్ర కుమార్ పండా (కలహండి), సుదర్శన్ గోయల్, బిష్ణు దాస్, సిప్రా వాజ్‌పేయి వంటి ప్రముఖులు ఉన్నారు. ప్రధాన కార్యదర్శులుగా బిరంచి నారాయణ్ త్రిపాఠి (పూరీ), శారదా ప్రసాద్ శతపతి (భువనేశ్వర్), సిమాంచల్ ఖొటేయి (సంబల్‌పూర్), పూర్ణిమ ప్రియదర్శని నాయక్ (కొరాపుట్)లను ప్రకటించారు. సరోజ్ కుమార్ కొరా (కటక్), కాళింది సామల్ (అంగుల్), స్మృతి పట్నాయక్ (కటక్), ప్రీతి ప్రతిభా భోలా (పూరీ), భగబాన్ మహంతి (కంధమల్) మరియు పింకీ ప్రధాన్ (భువనేశ్వర్) సహా పది మంది కార్యదర్శులు కూడా ఉన్నారు. అజయ కుమార్ అగర్వాల్ (భువనేశ్వర్) కోశాధికారిగా నియమితులయ్యారు. సీఏ దిబాకర్ హరిచందన్ (పూరీ) సంయుక్త కోశాధికారిగా వ్యవహరిస్తారు.

అధికారుల తనిఖీలు.. బెంబేలెత్తిన వ్యాపారులు


మండల కేంద్రంలో కిరాణా దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి

సారవకోట: మండల కేంద్రంలో గురువారం విశాఖపట్నం నుంచి ఫుడ్ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి, జిల్లాకు చెందిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. దీంతో వ్యాపారులంతా బెంబేలెత్తారు. రోడ్డు పక్కనే ఉన్న దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారని తెలిసి అందరూ దుకాణాలు మూసివేశారు. తాము పరిశీలించిన దుకాణాల్లో తేదీల లేపా లు లేవని వారు తెలిపారు. వ్యాపారాలు చేసుకునే వారు స్వలాభం తగ్గించుకుని ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉన్న వస్తువులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని నర్సింగిపల్లి గ్రామానికి చెందిన సింహాద్రి చలపతిరావు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైల్వే గేటు నుంచి టెక్కలి రైల్వే స్టేషన్ మధ్యలో పట్టాల మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా రైలు వచ్చి ఢీ కొట్టడంతో పక్కనున్న పొదల్లోకి తుళ్లిపోయాడు. ప్రమాదం గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన చలపతిరావును తీసుకువెళ్లేందుకు 108 వాహనం రాగా అప్పటికే ఆయన మృతి చెందాడు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పలాస: పలాస రైల్వే స్టేషన్ పరిధిలోని రెండో ప్లాట్ పారం లైన్‌లో వంతెన సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద జారి పడి మృతి చెందినట్టు పలాస జీఆర్పీ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మృతుడికి సుమా రు 45 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. శరీరంపై నాచురంగు గల ఫాంటు, నీలం రంగు గల టీ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440627567 సంప్రదించాలని ఆయన కోరారు.

కొల్లవానిపేటలో..

నరసన్నపేట: మండలం కొల్లవానిపేట సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ఆమదాలవలస రైల్వే ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఢీకొని బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఒడిశా వాసిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం తరలించామన్నారు.

'విద్యా ప్రమాణాల పెంపునకు కృషి'


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గురుకుల విద్యాసంస్థల సమన్వయకర్త వై.యశోదలక్ష్మి

కంచిలి: గురుకుల విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు మునుపటి కంటే పెంచడానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా గురుకుల విద్యాసంస్థల సమన్వయకర్త వై.యశోదలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రం కంచిలిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల భవనాలను, డార్మిటరీ భవనాన్ని పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి, వారి అవసరాలను తెలుసుకొన్నారు. అనంతరం గురుకులంలో సేవలందిస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావుతోనూ మాట్లాడారు. గురుకుల సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు. భోజనశాలలో పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆమెకు గురుకుల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు సహకరించారు.

భూమి లాక్కుంటున్నారు..

- జనసేన నాయకుడిపై మహిళ ఫిర్యాదు


విలేకరులతో మాట్లాడుతున్న చింతు విజయ

ఆమదాలవలస: తన భూమిని లాక్కునేందుకు జనసేన పార్టీ ఎంపీటీసీ అంపిలి విక్రమ్ అనే వ్యక్తి నాలుగేళ్లుగా తనను వేధిస్తున్నారని ఆమదాలవలస పట్టణానికి చెందిన మహిళ చింతు విజయ ఆరోపించారు. ఆమె గురువారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు. తాను బూర్జ మండలం కొల్లివలస గ్రామంలో 20 సెంట్ల భూమిని కొనుగోలు చేశానని, అదే భూమిని చేజిక్కించుకోవాలని అంపిలి విక్రమ్, వాళ్ల బావ పాండ్రంకి తారక్‌లు నాలుగేళ్లుగా తనను, తన కుటుంబాన్ని వేధిస్తున్నారని ఆమె చెప్పారు. సరుబుజ్జిలి తహసీల్దార్ రమణారావు భూమి కొలతలకు వచ్చినప్పుడు కూడా వారిద్దరూ పెట్రోలు పోసి సైట్ ఖాళీ చేయాలని బెదిరించారని పేర్కొన్నారు. కారుతో వెంబడించడం, రాత్రిళ్లు ఇంటి వద్ద రాళ్లు వేయించడం వంటి పనులు చేశారని ఆరోపించారు. తాను కోర్టును ఆశ్రయించగా, కోర్టు తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని, ఆ ఆర్డర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు సమర్పించానన్నారు. అయినా వేధింపులు ఆగడం లేదని చెప్పారు. తనకు రక్షణ కల్పించాలని కోరారు.

స్టడీ అవర్లు తప్పనిసరి: డీఈఓ

పొందూరు: పాఠశాలల్లో ప్రతి ఉపాధ్యాయుడికి వారంలో 30 పీరియడ్లు ఉండేలా చూడాల్సిన బాధ్యత పాఠశాల హెచ్ఎందేనని జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్ స్పష్టం చేశారు. మండలంలోని కింతలి జెడ్పీ ఉన్నత పాఠశాల, తాడివలస ఉన్నత పాఠశాలలను గురువారం పరిశీలించారు. పరీక్షలలో విద్యార్థుల ఫలితాలను ఆధారంగా చేసుకుని విద్యార్థులకు గ్రేడ్‌లు నిర్ణయించి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ తప్పనిసరిగా నిర్వహించాలని, స్టడీ అవర్స్‌కు హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎం కంఠయ్యను ఆదేశించారు.

గ్రామస్తుల నుంచి తల్లిదండ్రుల నుంచి, విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో సమస్యలు, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన జిల్లాస్థాయి స్కూల్ క్రికెట్ పోటీలు


విజేతగా నిలిచిన ఏపీ మోడల్ స్కూల్ పురుషోత్తపురం జట్టుతో జెడ్‌సీఎస్ అధ్యక్షుడు పుల్లెలశాస్త్రి, అతిథులు, కోచ్‌లు

- విజేతగా నిలిచిన ఏపీ మోడల్ స్కూల్ పురుషోత్తపురం
- రన్నరప్‌తో సరిపెట్టుకున్న శ్రీకాకుళం శ్రీచైతన్య స్కూల్

శ్రీకాకుళం న్యూకాలనీ: పది రోజుల పాటు కన్నుల పండువలా సాగిన జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు ముగిశాయి. శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జెడ్‌సీఎస్ స్కూల్‌గేమ్స్ హరకేశవ మెమోరియల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ 2025 సీజన్-1 చాంపియన్ ట్రోఫీని ఏపీ మోడల్ స్కూల్ పురుషోత్తపురం కైవసం చేసుకుంది. రన్నరప్‌గా శ్రీకాకుళంలోని మహాలక్ష్మినగర్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య (బ్రాంచ్-1) నిలిచింది. శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం మైదానం వేదికగా జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్ పర్యవేక్షణలో ఈ నెల 8వ తేదీన ఈ పోటీలు మొదలయ్యాయి. ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీచైతన్య స్కూల్ 66 పరుగులు మాత్రమే చేయగా, ప్రతిగా బ్యాటింగ్ మొదలుపెట్టిన ఏపీఎంఎస్ పురుషోత్తపురం మూడు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో రాణించిన శ్యామ్‌సుందర్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అలాగే టోర్నీలో అత్యద్భుతమైన ఆటతీరుతో రాణించినవారిలో బెస్ట్ బౌలర్‌గా హరికృష్ణ, బెస్ట్ బ్యాటర్‌గా సాత్విక్, బెస్ట్ ఫీల్డర్‌గా లిలిత్, మ్యాన్ ఆఫ్ ది టోర్నీగా శ్రీరామ్ ప్రత్యేకంగా బహుమతులు అందుకున్నారు. విజేతలకు ట్రోఫీలు, బహుమతులను జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, విద్యుత్‌ట్రాన్స్‌కో అధికారి రామకృష్ణ, ప్రసన్నకుమార్ బహూకరించారు.


సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాల కొరత

- సీపీఎం బృందం పర్యటనలో బయటపడ్డ వాస్తవాలు


వసతిగృహాల చుట్టూ మురుగుకూపాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సంక్షేమ హాస్టల్‌లో మౌలిక వసతులు లేక విద్యార్థులు దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోవడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఎం నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం నగరంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను సీపీఎం ప్రతినిధి బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ఎస్సీ హాస్టల్స్ 31, బీసీ హాస్టల్స్ 78, ఎస్టీ హాస్టల్స్ 60 ఉన్నాయని, వీటిల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించని వారు జిల్లాలో విమానాశ్రయాలు నిర్మిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తక్కువ మెనూ చార్జీలతో అరకొర భోజన సదుపాయాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు జిల్లా మంత్రులకు పట్టవా అని ప్రశ్నించారు. వర్షం పడితే ఎస్సీ హాస్టల్ మొత్తం నీటితో నిండిపోతుందని, ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఎస్టీ హాస్టల్‌కి వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎస్టీ హాస్టల్‌లో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఒక్కో హాల్ ఉన్నాయని, అందులోనే 200 మంది విద్యార్థులందరూ సామూహికంగా నిద్రించడం, భోజనం చేయడం, చదువుకోవడం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధి బృందం నాయకులు ఎం.గోవర్ధనరావు, పి.సుధాకర్, కె.సూరయ్య, ఎల్.మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'మౌలిక వసతులు కల్పించాకే తరలిస్తాం'


లాటరీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

సంతబొమ్మాళి: పోర్టు నిర్వాసిత కాలనీలో మౌలిక వసతులు కల్పించిన తర్వాతే మూలపేట గ్రామం ఖాళీ చేయించి మిమ్మల్ని తరలిస్తామని టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి అన్నారు. గురువారం పోర్టు నిర్వాసితులకు నౌపడలో కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వహించిన లాటరీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 506 పీడీఎఫ్‌లకు గాను ప్రతి పీడీఎఫ్‌కు 5 సెంట్లు ఇంటి స్థలం ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ స్థలం ఎక్కడ, మీ స్థలం ఏదీ అని తెలుసుకోవడానికి మాత్రమే లాటరీ తీస్తున్నామని అన్నారు. లాటరీ ద్వారా తీసిన నంబర్ ప్రకారం మీకు ఐదు సెంట్లు స్థలం చూపించడానికి 15 రోజుల సమయం పడుతుందన్నారు. సుడా అనుమతి పొందిన తర్వాతే లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయిస్తున్నామని, ఇది మార్చే అధికారం తనకు గానీ తహసీల్దార్‌కు గానీ లేదన్నారు. 586 ప్లాట్లను ఆరు బ్లాక్‌లుగా విభజించి ఎర్త్ ఫిల్లింగ్ ఇతర పనులు చేపడుతున్నామని అన్నారు. ఐదుకోట్ల 50 లక్షల రూపాయిలతో మరో రెండు అడుగులు ఎత్తు చేయడానికి ఎర్త్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నామని తెలిపారు. మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గుడి నిర్మాణానికి కూడా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ హేమసుందరరావు, స్థానిక సర్పంచ్ జీరు బాబురావు, మాజీ సర్పంచ్ జీరు భీమారావు, కోట నారం నాయుడు, జీరు శివ, రోహిణీరావ్, జీరు రాంబాబు తదితరులు ఉన్నారు.

పేకాట ఆడిన నలుగురికి జైలు శిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జిల్లా కేంద్రంలోని మొండేటివీధిలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురిలో నలుగురికి ఒక నెల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. మరో ఇద్దరికి రూ. 3 వేలు జరిమానా విధించారు. దీనికి సంబంధించి ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ వివరాలు వెల్లడించారు. జిల్లా సెకెండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.శివరామకృష్ణ తీర్పు వెలువరించారని ఎస్ఐ పేర్కొన్నారు. డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో కూడా ఒకరికి నెల రోజుల జైలు శిక్ష విధించింది.

ఒడిశా వయా శ్రీకాకుళం ఉత్తరప్రదేశ్

- 208.7 కిలోల గంజాయితో పట్టుబడిన ఉత్తరప్రదేశ్ వాసులు
- రూట్ మార్చి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- గంజాయి తరలిస్తున్న కారు అద్దాలపై ఢిల్లీ హైకోర్టు అడ్వకేట్ ట్యాగ్స్


నిందితులు, గంజాయిని చూపిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఉత్తరప్రదేశ్‌లో ఉన్న ఓనరు ఆదేశిస్తాడు.. వీరు పాటిస్తారు. ఎవరి దగ్గరకు వెళ్లాలి.. ఎక్కడ గంజాయి కొనాలి.. ఎలా తిరిగి రావాలి.. చెక్‌పోస్టులు ఉంటే ఎలా తప్పించుకోవాలి.. ఇలా అన్ని ప్లాన్లు ఓనరే వేస్తాడు. అతను చెప్పింది చెప్పినట్లు వీరు పాటిస్తారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా వీరు ఖాకీల నుంచి తప్పించుకోలేకపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్, మీరట్‌లకు చెందిన సునీల్ (38), విశాల్ (28)లు ఒడిశాలోని కొరాపుట్ నుంచి టొయోటో కారులో 208.79 కిలోల గంజాయిని చెక్‌పోస్టులు తప్పించి.. రూట్ మార్చి మళ్లించే యత్నంలో చిలకపాలెం వద్ద ఎచ్చెర్ల పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం విలేకరులకు వివరాలు వెల్లడించారు.

ఎప్పటి నుంచో..

మీరట్‌లోని డాట్‌లో స్పై హోటల్ నడుపుతున్న గౌరవ్ వద్ద సునీల్, విశాల్‌లు కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఎప్పటి నుంచో వీరు గంజాయి క్రయవిక్రయాల్లో సిద్ధహస్తులు. ఈ క్రమంలో ఒడిశాలోని కొరాపుట్ జిల్లా దంతపురి సమీప లంపటాపుట్ గ్రామానికి చెందిన సమర మాటం అలియాస్ డొంబురు వద్ద ఈనెల 14న 40 ప్యాకెట్లలో 208.7 కిలోల గంజాయిని తీసుకున్నారు. శ్రీకాకుళం చెక్‌పోస్టులను తప్పించి దారి మళ్లించి విశాఖ చేరేందుకు వీరు టొయాటో కారులో కొరాపుట్ నుంచి బయల్దేరారు.

రూట్ మార్చారిలా..

ఒడిశా కొరాపుట్ నుంచి చత్తీస్‌గఢ్ రాష్ట్ర బోర్డర్ అనుకొని ఉన్న సిమిలిగుండ మీదుగా పొత్తంగి వద్ద అడ్డుదోవ తీసుకుని సమీపంలోని ఒడిశా సుంకి చెక్‌పోస్టును తప్పించారు. అక్కడి నుంచి విజయనగరం జిల్లా సాలూరు నుంచి రామభద్రాపురం, రాజాం, పొందూరులు దాటి చిలకపాలెం జంక్షన్ వద్దకు వచ్చి పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. అప్పటికే ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కు ఈగల్‌టీమ్ సమాచారం ఉండటంతో కారును తనిఖీ చేశారు.

కారుపై ఢిల్లీ హైకోర్టు అడ్వకేట్ స్టిక్కర్లు

వీరు ప్రయాణిస్తున్న కారుపై ఢిల్లీ హైకోర్టు బార్ కౌన్సిల్, జాతీయ చిహ్నం గుర్తుతో అడ్వకేట్ 2019, అడ్వకేట్ 2021 స్టిక్కర్లు ఉండటంతో అనుమానం వచ్చి లోపల తనిఖీ చేయగా 40 ప్యాకెట్లలో గంజాయి పట్టుబడింది. వీరు చిలకపాలెం నుంచి విశాఖ చేరి అక్కడి నుంచి విజయవాడ, ఖమ్మం, వరంగల్ మీదుగా నాగపూర్ హైవేకు చేరి అక్కడి నుంచి మీరట్ వెళ్లి తమ ఓనరుకు అప్పగిస్తామని విచారణలో పేర్కొన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. ప్రస్తుతం గంజాయిని వీరికి అందించిన ఒడిశా సమరమాటం, అతనికి సహకరించిన మరో వ్యక్తి పరారీలో ఉన్నారని, మీరట్ ఓనర్ అయిన గౌరవ్ వద్దకు పోలీసులను పంపించామని, వీరేకాక మరో ముగ్గురిని నిందితులుగా గుర్తించామని ఎస్పీ పేర్కొన్నారు. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు.

క్లుప్తంగా

వైద్యరంగంలో మత్తు వైద్యులది కీలక ప్రాత

• సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్



ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ

విజయనగరంఫోర్ట్: వైద్యరంగంలో మత్తు వైద్యులది కీలకపాత్ర అని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ అన్నారు. ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవం సందర్భంగా సర్వజన ఆస్పత్రిలో నిర్వహించిన ర్యాలీని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర కేసులకు వైద్యం అందించడంలోనూ, శస్త్ర చికిత్స చేయడానికి అవసరమైన మత్తు ఇచ్చేది మత్తు వైద్యులేనన్నారు. కోవిడ్ తర్వాత మత్తు వైద్యులకు మంచి గుర్తింపు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో మత్తు వైద్య విభాగం అధిపతి డాక్టర్ డి.జయధీర్‌బాబు, ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ లోక్‌నాథ్, మానసిక విభాగం హెచ్ఓడీ డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

సాలిపేటలో బంగారం చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న గజపతినగరం పోలీసులు

గజపతినగరం: మండలంలోని సాలిపేట గ్రామానికి చెందిన రొంగలి శంకరరావు ఇంట్లో బంగారం చోరీకి గురి కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం రొంగలి శంకరరావు తన ఇంటికి తాళం వేసి భార్య పద్మతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లాడన్నారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయని, అలాగే బీరువా తలుపులు కూడా దొంగలు పగుల గొట్టారన్నారు. బీరువాలో ఉండాల్సిన సుమారు మూడు తులాలు బంగారం పుస్తెల తాడు, రెండు శతమానాలను దొంగిలించినట్లు బాధితుడు శంకరరావు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ మేరకు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

మూగ బాలికపై వృద్ధుడి లైంగిక దాడి యత్నం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఓ మూగ బాలికపై వృద్ధుడు లైంగికదాడి యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె మూగబాలిక. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి సమీపంలో ఒంటరిగా ఉన్న బాలిక నోటిపై చెయ్యిపెట్టి తన ఇంట్లోకి వృద్ధుడు లాక్కెల్లాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వృద్ధుడి బారి నుంచి బాలికను రక్షించారు. బాధితురాలి తండ్రి గురువారం జామి మండలం తాండ్రంగి గ్రామానికి చెందిన మానవహక్కుల సంఘం ప్రతినిధి కొత్తలి గౌరునాయుడికి ఫిర్యాదు చేయగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం సీఐ నారాయణమూర్తిని వివరణ కోరగా ఫిర్యాదు అందిందని విచారణ చేయాల్సి ఉందన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం: ప్రతిఒక్కరూ సీపీఆర్(కార్డియో పల్మనరీ రీససియేషన్)పై అవగాహన కలిగి ఉండడం తప్పనిసరి అని మాజీ ఎంపీ, మాజీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. నగరంలోని 42వ డివిజన్ అయ్యన్నపేట వాకింగ్ ట్రాక్ వద్ద శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన.. గుండెపోటుకు గురైన వ్యక్తికి తక్షణమే సీపీఆర్ చేయాలని, దీనిపై అందరూ అవగాహన కలిగి ఉంటే ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. అనంతరం సీపీఆర్ ఏ విధంగా చేయాలి..దాని ప్రయోజనాలను వివరించారు. అందరూ రోజూ వ్యాయామం చేస్తూ పౌష్టికాహారం తీసుకుంటే గుండె సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు కె.సత్యనారాయణ, పి.అప్పలరాజు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందం వెంబడి అంధకారం

• బాణసంచా పేల్చడంలో జాగ్రత్తలు పాటించాలి
• పెద్దలు వెంట ఉంటే ఆనందం మీ వెంటే



రామభద్రపురంలో విక్రయిస్తున్న టపాసులు (ఫైల్)

రామభద్రపురం: జాతి, కుల, మత,వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండగ దివ్య దీపావళి. చీకటిని పారదోలి వెలుగులు నింపే పండగగా, విజయానికి ప్రతీకగా దీపావళిని ఏటా ఆశ్వయుజ మాసంలో అమావాస్య రోజున జరుపుకోవడం ఆనవాయతీ. అయితే దీపావళిని వేడుకగా జరుపుకునే క్రమంలో చాలా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి పలువురు గాయపడుతున్నారు. టపాసులు పేల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. బాణసంచాలోని రసాయనాలతో కళ్లు దెబ్బతింటాయి. సల్ఫర్, గన్‌పౌడర్ లాంటి రసాయనాల ప్రభావం వల్ల కళ్ల నుంచి నీరు కారడం, కళ్ల మంటలు, దురద వంటి ప్రభావాలు ఉంటాయి. ఒక్కోసారి కళ్లు పూర్తిగా కనబడకుండా పోతాయి.

నిఘాతోనే అక్రమానికి అడ్డు కట్ట

రూ.లక్షల విలువైన సరుకును ఎలాంటి అనుమతులు లేకుండా దిగుమతి చేసుకుని నిల్వ ఉంచుతున్నారు.పండగ రోజు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కొందరైతే ఏకంగా నివాస ప్రాంతాల మధ్య నిబంధనలు పాటించకుండా నిల్వ చేస్తున్నారు. అలాగే తాత్కాలికంగా అనుమతులు తీసుకున్న దుకాణాల వ్యాపారులు మిగిలిన సరుకును కొన్ని చోటకే తిరిగి పంపాల్సి ఉంటుంది. కానీ కొందరు అలా చేయడం లేదు.పలు చోట్ల గుట్టుగా నిల్వ చేసి ఇతర సమయాల్లోనూ అమ్మేస్తున్నారు.కొందరైతే ఎలాంటి అనుమతులు లేకపోయినా పొరుగు ప్రాంతాల నుంచి పేలుడు పదార్థాలు తెప్పించి ఇళ్లలోనే టపాసులు తయారు చేస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు స్పందించి తనిఖీలు చేయకపోతే అనుమతి లేని వారు విక్రయాలతో పాటు చేసే నిల్వలతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాద నివారణ, జాగ్రత్తలు ఇలా..

- టపాసులు వెలిగించిన వెంటనే దూరంగా జరగాలి
- పేలని టపాసులపై వంగి చూడడం మంచిది కాదు
- కంటికి రక్షణగా ప్లెయిన్ అద్దాలు వాడడం మంచిది
- పేరున్న సంస్థలు తయారు చేసిన టపాసులనే ఎంపిక చేసుకోవాలి
- పిల్లలు, యువకులు, మహిళలు ఇలా ఎవరు ఏ రకం టపాసులు కాల్చాలో ముందే నిర్ణయించుకుని ప్రణాళిక మేరకే కొనాలి
- ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలి
- బాణసంచాను కిచెన్, పొయ్యి ఉన్న ప్రాంతాల్లో ఉంచకూడదు
- బాణసంచా కాల్చేటప్పుడు వదులుగా ఉన్న దుస్తులు ధరిస్తే అవి వేలాడుతూ అంటుకునే ప్రమాదం ఉంది. కొద్దిగా బిగుతైన కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి
- చిన్న పిల్లలను ఎత్తుకుని బాణసంచా కాల్చకూడదు.పెద్ద వారి సహాయం లేకుండా పిల్లలు వారంతట వారే బాణసంచా కాల్చరాదు
- అప్పుడే పుట్టిన చిన్నారులు, గర్భిణులు, వృద్ధులపై బాణసంచా శబ్దాలు ఎక్కువ ప్రమాదం చూపుతాయి. ప్రధానంగా చెవులు దెబ్బతింటాయి. చెవులను రక్షించుకోవడానికి ఇయర్ ప్లగ్స్ కొంత మేరకు ఉపయోగపడతాయి. పెద్ద శబ్దాలతో పేలే టపాసులు కాకుండా చాలా తక్కువ శబ్దంతో పూలలాంటి వెలుగులు కురిపించే చిచ్చుబుడ్లు, కాకర పువ్వొత్తులు, పెన్సిళ్లు, భూచక్రాలు వంటివి కాల్చడం మంచిది.భూచక్రాలు, బొట్లు కూడా ఒక్కోసారి పేలే ప్రమాదం ఉంది. వాటిని అగ్గిపుల్లలతో కాకుండా కాకర పువ్వొత్తులతో కాల్చడం మంచిది.

సొంత వైద్యం వద్దు



టపాసులు కాల్చేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే కొందరు సొంత వైద్యం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. వెంటనే దగ్గరలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రథమ చికిత్స చేసే ముందు కాలిన గాయంపై చల్లని నీరు పోయాలి. అంతేగానీ ఐస్‌ముక్కలతో రుద్దకూడదు. వెన్న గ్రీజ్, ఇతర పౌడర్లు వంటివి రాయకూడదు. వాటివల్ల ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. **దిలీప్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రామభద్రపురం**

కాల్చే ముందు అప్రమత్తం



పెద్దవాళ్ల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణసంచా కాల్చడం ఉత్తమం. టపాసులు కాల్చేటప్పుడు నీళ్ల దగ్గర పెట్టుకోవాలి.ఇంటి కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఉదయం 6 నుంచి 8 వరకు,రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలి.దీపావళి పండుగ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలాగే ఏ విధమైన అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయిస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. **వి.ప్రసాదరావు, ఎస్సై, రామభద్రపురం**

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



అప్పారావు మృతదేహం

నెల్లిమర్ల: స్థానిక చంపావతినదిలో బుధవారం గల్లంతైన కనకల అప్పారావు(46) మృతదేహం లభ్యమైంది. జరజాపుపేటకు చెందిన కనకల అప్పారావు థామస్‌పేట వద్ద చంపావతినదిలో స్నానానికి దిగి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మునిగిపోయి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపకసిబ్బంది గాలింపు చేపట్టగా కొండపేట వెళ్లే రహదారిలో జూట్‌మిల్లు వద్ద మృతదేహం గురువారం లభ్యమైంది. మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం పోలీసులు తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి–చీపురుపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని శ్రీకాకుళం జీఆర్పీ హెచ్‌సీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. పాండిచ్చేరి నుంచి హౌరా వెళ్లే రైలు ఢీకొట్టగా మృతి చెందాడన్నారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో మృతదేహం ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9110305494 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి..



అచ్యుతరావు మృతదేహం

గుర్ల: మండలంలోని తెట్టంగి శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుబర్తికి చెందిన తాడేల అచ్యుతరావు (35) మృతి చెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..దీపావళి సందర్భంగా బాణ సంచా కొనుగోలు చేయడానికి పెనుబర్తి నుంచి గవిడి పేట వెళ్తుండగా తెట్టంగి దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో జరిగిన ప్రమాదంలో అచ్యుతరావు అక్కడికక్కడే మృతిచెందాడు. అదే బైక్‌పై వెళ్తున్న గుషిడి నారాయణ రావుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన వ్యక్తిని చీపురుపల్లి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు వసంత్ కుమార్, తరుణ్ ఉన్నారు.

పూరిల్లు దగ్ధం



కాలి బూడిదైన పూరిల్లు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామానికి చెందిన బొమ్మరిల్లు రాజారావు పూరిల్లు గురువారం అగ్నికి ఆహుతైంది. సమాచారం మేరకు పొందూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.1.5 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాక సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదన్నారు. ఇల్లు కాలిపోవడంతో కుటుంబం వీధిన పడిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రాజారావు కోరుతున్నాడు.

హెచ్ఐవీ రోగులకు శస్త్ర చికిత్సలు

• స్పందించిన సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు

సాక్షి ఎఫెక్ట్

విజయనగరంఫోర్ట్: హెచ్ఐవీ రోగులకు శస్త్రచికిత్సలు చేయడం లేదనే అంశంపై సాక్షిలో ఈనెల 14వ తేదీన హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష శీర్షికన ప్రచురించిన కథనానికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. ఆస్పత్రిలో హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ రోగులకు శస్త్రచికిత్సలు చేస్తున్నామని తెలిపారు. ఒక వేళ ఎవరైనా శస్త్రచికిత్సలు చేయడానికి నిరాకరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ తెలిపారు.

నేడు సబ్‌జూనియర్స్ ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 17న నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారిప్రసాద్ తెలిపారు. నగరంలోని విజ్జీస్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికల్లో 2012 నుంచి 2014 సంవత్సరాల మధ్య జన్మించిన బాల, బాలికలు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డుతో పాటు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కాకినాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజనం గుండెఘోష పట్టదా..?



ప్లకార్డులు, ఇటీవల మృతిచెందిన విద్యార్థుల ఫొటోలతో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

• ప్రజాసంఘాల నాయకులు
• కలెక్టరేట్ ఎదుట నిరసన

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వరుస మరణాలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్క లేదా? ఇంకెంతమంది విద్యార్థులను నిర్లక్ష్యంతో బలిచేస్తారంటూ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్‌లు మాట్లాడుతూ గిరిజన విద్యాసంస్థలు విద్యార్థుల పాలిట నిర్లక్ష్యంతో వారి ప్రాణాలను బలిగొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పసిమొగ్గలు పిట్టల్లా రాలిపోతున్నాయని ఈ మరణాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను పత్రికాముఖంగా ప్రభుత్వానికి తెలియజేశారు. విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు, వైద్యసేవలు అందించాలి. మృతిచెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ. 25లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. అలాగే విద్యార్థుల మరణాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకుని సురక్షితమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఇటీవల మృతిచెందిన విద్యార్థుల ఫొటోలు చూపిస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వికాస్, బుచ్చి, కార్తీక్, చరణ్, గణేష్, మల్లేష్, చందు, గౌరీశ్వరి, చిన్నారావు, కొందరు తల్లిదండ్రులు, పలు పార్టీల నాయకులు శివప్రసాద్, గౌరీశంకరరావు, ఈవీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అప్పగింత

విజయనగరం క్రైమ్: నగరంలో అయ్యన్నపేటకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యమైన కేసును పోలీసులు ఛేదించారు. యువతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఆర్వీకే చౌదరి మిస్సింగ్ కేసు నమోదుచేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందంతో దర్యాప్తు చేశారు. ఇద్దరినీ తెలంగాణా రాష్ట్రంలో గుర్తించి తీసుకొచ్చారు. తల్లిదండ్రులకు గురువారం అప్పగించారు. అయితే, వారు తల్లిదండ్రుల మాట వినకుండా తిరిగి తమ దారిలో వెళ్లిపోయినట్లు తెలిసింది.

పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్



ధారగెడ్డకు వెళ్లే దారిలో ఉన్న తుప్పలు, డొంకలు తొలగిస్తున్న దృశ్యం

పాచిపెంట: మండలంలోని పలు పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. అభివృద్ధి చేస్తే 'అరుకుకు దీటుగా అందాలు' శీర్షికన గత నెల 29వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. మండలంలోని పర్యాటక ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని వెలుగు డీపీఎం శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పజెప్పారు. అందులో భాగంగా ధారగెడ్డకు వెళ్లే దారిలో ఉన్న తుప్పలు డొంకలు గురువారం తొలగించారు. ఈ పనులు పర్యవేక్షిస్తున్న వెలుగు ఏపీఎం శ్రీరాములు 'సాక్షి' తో మాట్లాడుతూ త్వరలో రహదారి నిర్మాణం చేపట్టనున్నామని, వాటితోపాటు ప్రత్యక్షంగా పర్యాటకులతో మాట్లాడి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే వెలుగు మహిళా సంఘాల సభ్యులకు లోన్ రూపంలో డబ్బులు మంజూరు చేసి పర్యాటక ప్రదేశాల్లో షాపులు ఏర్పాటు చేయించి పర్యాటకులకు అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి...



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

దత్తిరాజేరు: మండల కేంద్రమైన దత్తిరాజేరులో గురువారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పువ్వల శ్రీనివాసరావుతో పాటు పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మహదేవ్ ఫణీంద్రుడు, మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేవని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం కుంటుపడిందని ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపు వల్ల అన్ని వర్గాలకు ప్రయోజనం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

విజయనగరం టౌన్: జీఎస్టీ శ్లాబ్‌ను రెండుకు తగ్గించడం వల్ల అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాంతీయ రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ వాహన ర్యాలీని కలెక్టరేట్ వద్ద గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఆర్అండ్‌బీ జంక్షన్, సంతకాల వంతెన, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఉప రవాణాధికారి డి.మణికుమార్, ఆర్టీఓ విమల, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాప్రసాద్, రవిశంకర్ ప్రసాద్, శివరాంగోపాల్, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలి

• మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మౌనం పాటిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: మంచి చదువులు చదివి జీవితంలో గొప్పస్థాయికి ఎదిగి తమ కష్టాలను శాశ్వతంగా దూరం చేస్తారని కోటి ఆశలతో బిడ్డలను పాఠశాలలకు పంపగా అక్కడ సరైన సదుపాయాలు లేక అనారోగ్యాలకు గురై అమాయక గిరిజన బిడ్డలు మరణిస్తున్నారు. ఆ బిడ్డల తల్లిదండ్రులకు సంబంధిత శాఖ మంత్రి, ప్రభుత్వం ఏం సమాధానం చెబుతారని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురై మరణించిన విద్యార్థులు, దివంగత మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ పువ్వలనాగేశ్వరరావులకు నివాళులు అర్పించి కొన్ని నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల ప్రాణాలు రక్షించడంలో గిరిజనసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని, ఫలితంగా గిరిజన విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని గిరిజన విద్యార్థులు మరణిస్తుంటే గిరిజనశాఖ మంత్రికి బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 13 మంది విద్యార్థులు మృతిచెందారని, సాలూరు నియోజకవర్గంలో ఇద్దరు మృతిచెందారన్నారు. కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 175 మంది పచ్చకామెర్లతో బాధపడుతూ కురుపాం, పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా సంబంధిత గిరిజన సంక్షేమశాఖమంత్రికి, ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయమన్నారు.

జాతీయ స్థాయిలో ఫిర్యాదు చేశాం

విద్యార్థులు పచ్చకామెర్లతో చనిపోతున్నా,సెరిబ్రల్ మలేరియా, జ్వరంతో చనిపోతున్నట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల మరణాలపై జాతీయమానవహక్కుల సంఘానికి, జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఢిల్లీలో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఇంతమంది విద్యార్థులు మృతిచెందడం వల్ల జిల్లా మంత్రిగా ఆమె విఫలమయ్యారని, ఈ శాఖలో మరణాలపై సదరు మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌కు విశేష స్పందన

వీరఘట్టం: సైన్స్ సెమినార్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన రావడం ఎంతో శుభ పరిణామం అని ఎంఈవోలు గౌరినాయుడు, ఆనందరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ సెమినార్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెమినార్‌లో ఇచ్చిన «క్వాంటమ్ యొక్క కాలం... దాని శక్తి సామర్థ్యాలు» అనే అంశంపై విద్యార్థులు వివరించారు. మొత్తం 12 మంది విద్యార్థులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కత్తులకవిటి హైస్కూల్‌కు చెందిన జి.చైతన్య ప్రథమ స్థానం, పి.వి.ఆర్ పురం యూపీ స్కూల్‌కు చెందిన పి.షర్మిల ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి ఎంఈవోలు, సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.సాంబర, సి.హెచ్.రత్నాకరరావు, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సంపత్‌కుమార్, జి.లక్ష్మణరావు, జి.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.